

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లి పరిధి ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. మంగళవారం కాజీపల్లి 181 సర్వే నంబరులో ఐదు బేస్మెంట్లను ఆర్‌ఐ కూల్చివేయించారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

'ఇందిరమ్మ' సర్వే గడువు లోపు పూర్తి చేయాలి

మెదక్ జిల్లాలో 72 శాతం సర్వే పూర్తి : మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలో చిన్నఘనపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలను మొబైల్ యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1.91 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 72 శాతం దరఖాస్తులను పరిశీలించామని, గడువు లోపు మిగిలిన 38 శాతం పూర్తి చేయాలని ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దరఖాస్తుదారుల వివరాలను ట్యాబ్‌లలో పక్కాగా నమోదు చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. అవసరమైతే ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహాయం తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కూడా ఈ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



'ఇందిరమ్మ' సర్వే యాప్‌లో దరఖాస్తుదారు ఫొటోను అప్‌లోడ్ చేస్తున్న మెదక్ కలెక్టర్

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజ

- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన సంగారెడ్డి
- వేలాదిమందికి మహా అన్నదానం
- భజన, నృత్యాలతో ఉత్సాహం నింపిన జగ్గారెడ్డి





అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, సతీమణి నిర్మల, కుమార్తె జయారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, మహా పడిపూజలో భజన పాటలు పాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి నివాసంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఘనంగా జరిగింది. అంతకుముందు జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి మహాపడి పూజకు వేలాదిమంది అయ్యప్ప భక్తులు, మహిళలు తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప భక్తులతో కలిసి భజన పాటలు, నృత్యాలతో జగ్గారెడ్డి ఉత్సాహం నింపారు. భక్తులకు మహా అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రత్యేక పూజల్లో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి నివాసం వద్ద జరిగిన మహా పడిపూజకు హాజరైన అయ్యప్ప స్వాములు ▼



నయా జోష్

- అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు
- తెల్లవారుజాము వరకు కొనసాగిన వేడుకలు
- కేక్‌లు, చికెన్, మటన్‌కు ఫుల్ డిమాండ్
- వైన్‌షాపుల ఎదుట ఉదయం నుంచే జనం బారులు



మెదక్‌లో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కేక్‌లు కొనుగోలు చేసేవారితో కిక్కిరిసిన బేకరీ

మెదక్ అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అంబరాన్నంటేలా సంబరాలు నిర్వహించారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. 2025కు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు న్యూ ఇయర్ వేడుకలు కొనసాగాయి. ఉదయం నుంచే యువతీ, యువకులు వేడుకల కోసం ఏర్పాట్లను చేసుకున్నారు. అర్ధరాత్రి 12 దాటగానే పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా హ్యాపీ న్యూఇయర్ కేరింతలతో మార్మోగాయి. ఇళ్ల నుంచి వీధుల్లోకి వచ్చి కేక్‌లు కట్‌చేసి పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి ఫోన్‌లన్నీ బిజీగా మారిపోయాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాకేంద్రాలతో పాటు మున్సిపాలిటీలు, పట్టణాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

మార్కెట్లు కిటకిట..

కొత్త సంవత్సరం సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడాయి. వేడుకలకు అనుగుణంగా వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యువతను ఆకర్షించేందుకు వివిధ ఆకారాల్లో భారీ కేక్‌లు తయారు చేశారు. ప్రజలు సాయంత్రం నుంచే కేక్‌లను తీసుకెళ్లారు. నాన్‌వెజ్ కోసం మద్యం ప్రియులు ఎగబడ్డారు. రాత్రి 12 గంటల వరకు మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో విచ్చలవిడిగా మద్యాన్ని కొనుగోలు చేస్తూ.. తెగ ఎంజాయ్ చేశారు. అలాగే చికెన్, మటన్‌లతో తయారు చేసిన రుచికరమైన వంటకాలను కొనుగోలు చేశారు. కొందరు వ్యాపారులు అర్ధరాత్రి డిస్కౌంట్‌లతో వినియోగదారులను ఆకర్షించారు. పన్నెండు కాగానే కేక్‌లు కట్ చేసుకొని ఒకరికొకరు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొంటూ సంతోషాన్ని పంచుకున్నారు.



సంగారెడ్డిలో వైన్‌షాప్ ఎదుట కొనుగోలుదారుల సందడి



సంగారెడ్డిలో కేక్ కట్‌చేస్తున్న యువతులు

సిద్ధివినాయక జయంతి ఉత్సవాలు

4 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



కొలువుదీరిన సిద్ధివినాయకుడు

న్యాల్‌కల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్‌లో స్వయంభువుగా వెలిసిన సిద్ధివినాయకుడి జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలు జనవరి 4 వరకు కొనసాగనున్నాయి. స్వామివారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం ఉదయం వేదగోష, దీపప్రజ్వలన, ధ్వజారోహణ, స్వస్తి పుణ్యాహవాచనం, అభిషేకం, లక్షపుష్పార్చన, మంటపారాధన, దేవతాహ్వానం, మంగళహారతి తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. జనవరి 1, 2 తేదీల్లో అభిషేకం, గణపతి హవనం, శతచండీయాగం, మంగళహారతి, 3న రుద్రాభిషేకం,ఆవర్తన అభిషేకం, గణపతిహోమం, శతచండీహోమాలు, హోమసమాప్తి, మహాపూర్ణాహుతి, మహానైవేద్యం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. 4న స్వామివారికి అభిషేకం, సామూహిక కల్యాణం, మహామంగళహారతి, తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కదులుతున్న కారులో మంటలు



మంటల్లో దగ్ధమైన కారు

రామచంద్రాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న కారు ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. అప్రత్తమైన యజమాని కారును ఓ పక్కకు నిలిపి, కారు నుంచి బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం సంగారెడ్డి ఇంద్రకరణ్‌కు చెందిన వెంకటేశ్ మంగళవారం కారులో శేరిలింగంపల్లి చందానగర్‌కు వచ్చారు. సాయంత్రం పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరగా రాత్రి 10 గంటలకు 65వ నంబరు జాతీయ రహదారిపై ఇక్రిశాట్ వద్దకు చేరుకోగానే కారు ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే వెంకటేశ్ కారును ఓ పక్కకు నిలిపి బయటకు వచ్చాడు. స్థానికుల సాయంతో మంటలను ఆర్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

SANTOOR
సంతూర్
ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి
ABN
అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.

మెదక్ జిల్లా	సంగారెడ్డి జిల్లా
వేదిక: సిద్ధార్థ మోడల్ హైస్కూల్ (వెంకట్రావునగర్) మెదక్	వేదిక: సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్, (శాంతినగర్), సంగారెడ్డి
తేదీ : 04.01.2025 (శనివారం)	తేదీ : 05.01.2025 (ఆదివారం)
స్పాన్సర్: సిద్ధార్థ మోడల్ హైస్కూల్	స్పాన్సర్: వాసవి మాఇల్లు స్వచ్ఛంద సేవాసంస్థ
సమయం: ఉదయం 10 నుంచి 12 గంటల వరకు	సమయం: ఉదయం 10 నుంచి 12 గంటల వరకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: 9955406529, 9963666434	సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: 9603208270, 9985411354

నిబంధనలు
- మహిళలు మాత్రమే పాల్గొనాలి.
- ముగ్గు, రంగులు, పూలు వగైరా సామగ్రి ఎవరివి వారే తెచ్చుకోవాలి.
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
- ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అని చెప్పగలిగి ఉండాలి.
- ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు.
- ముగ్గు ఐడియా లేదా డిజైన్‌కు (ఆలోచనకు) 5 మార్కులు, లుక్‌కు (అందానికి) 15 మార్కులు.. మొత్తం 20 మార్కులు
- ముగ్గును చేతితోనే వేయాలి. గొట్టాలు, బద్దలు వంటివి ఉపయోగించి వేస్తే వచ్చిన మార్కుల్లో నుంచి మూడు మార్కులు కట్ చేస్తారు. అయితే జల్లెడ ఉపయోగించవచ్చు.
- ముగ్గుల్లో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు. అవి తప్ప ఇతరత్రా వస్తువులను ఎక్కువగా అమర్చకూడదు. ముగ్గుకు అదనపు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులను వాడాలి తప్పితే ఆ వస్తువులనే ప్రధానాంశంగా చేసుకోకూడదు.

మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-
యవ్వనపు చర్మ రహస్యం
SANTOOR Skin Moisturising Sandal & Turmeric




రూ. 15.95 లక్షల విలువైన
ఆల్ప్రాజోలం పట్టివేత
- 150 నిషేధిత సిరప్ బాటిళ్లు స్వాధీనం
- 40 లక్షల విలువైన కారు సీజ్, ఇద్దరు నిందితుల అరెస్టు
- గుమ్మడిదలలో రూ.3.50 లక్షల విలువైన సరుకు..
6


Fashion Partner
DIGSEL WOMEN'S
సెల్సియా
ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు
selsia TRENDY WOMEN'S
BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675

Gardening Partner
ఎటువంటి పంటలకైనా క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్
ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.
✔ వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ ✔ సేంద్రీయ వ్యవసాయం ✔ రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి ✔ 11 వనమూలికల ఔషధ సమ్మేళనం ✔ సమగ్ర సస్య సంరక్షణ
B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు.
ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.
ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148


















రూ.15.95 లక్షల విలువైన

ఆల్ప్రాజోలం పట్టివేత



చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న కారులోని ఆల్ప్రాజోలం, సిరప్‌లు

- 150 నిషేధిత సిరప్ బాటిళ్లు స్వాధీనం
- 40 లక్షల విలువైన కారు సీజ్, ఇద్దరు నిందితుల అరెస్టు

జహీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న రూ.15.95 లక్షలు విలువ చేసే ఆల్ప్రాజోలం పట్టు కున్నామని మెదక్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ అస్లాం, ఎండీ అలీంఖాన్ కర్ణాటక నుంచి రూ.40 లక్షల విలువ చేసే కారులో వస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కారును నిలిపి తనిఖీ చేశారు. కారులో రూ.15.95 లక్షలు విలువ చేసే 7,500 ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లు, రూ.28 వేలు విలువ చేసే 150 నిషేధిత కొడినెట్ సిరప్ బాటిళ్ల బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి విచారించగా హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంకు ప్రాంతంలో అనుమతిలేని మెడికల్ దుకాణాలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లు, నిషేధిత సిరప్‌ను పట్టుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ యాదయ్య, ఎక్సైజ్ పోలీసులు సతీష్, రామారావునాయక్, ప్రహ్లాద్‌రెడ్డి, వివేక్, ఖరీంను, ఎక్సైజ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

గుమ్మడిదలలో రూ.3.50 లక్షల విలువైన..

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3.50 లక్షల విలువ చేసే 350 గ్రాముల ఆల్ప్రాజోలంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన డొల్లూరి సాయిలుగౌడ్ అలియాస్ రాజు(51) గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీసీఎస్ జిల్లా పోలీసులు, గుమ్మడిదల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3.50లక్షల విలువైన 350 గ్రాముల ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. సాయిలుగౌడ్ గడిపెద్దాపూర్‌లో కల్లు డిపోను లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతని చిన్న నాన్న అయిన లింగన్నగారి నారాయణమూర్తి, పుల్కల్ మండలం ముదిమాణిక్యంకు చెందిన అశోక్‌గౌడ్ ఆల్ప్రాజోలంను సాయిలుకు ఇచ్చారు. దాన్ని తీసుకొని సాయిలు మంగళవారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నారాయణమూర్తి, అశోక్‌గౌడ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పటాన్‌చెరుకు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ రూపేష్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జిన్నారం సీఐ నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న ఎస్పీ

భూనిర్వాసితుడి ఆత్మహత్యాయత్నం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగేందుకు ప్రయత్నం

అక్కన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూమి కోల్పోయి ఐదేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ భూనిర్వాసితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కలకలం సృష్టించింది. తహసీల్దార్ కార్యాలయం వద్దకు పురుగుల మందు డబ్బాతో వచ్చిన రైతు నుంచి తహసీల్దార్ అనంతరెడ్డి, పోలీసు పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన నందారపు సంపత్ అనే రైతుకు తన తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. సర్వే నంబర్ 491/8లో 1.10 ఎకరాల భూమి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తన తండ్రి అయిన నందారపు వెంకటయ్యకు ఇచ్చారని తెలిపారు. ఈ భూమి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైందని పేర్కొన్నారు. 2016-17 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో తన పేరు వచ్చిందని, రెవెన్యూ అధికారులు చెక్కులపై తన సంతకాలు తీసుకుని మూడు నెలల్లో భూ పరిహారం వస్తుందని చెప్పారని తెలిపారు. అప్పటి నుంచి పరిహారం కోసం ఎదురు చూస్తున్నానని, ఐదేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుపైన వచ్చిన భూ పరిహారాన్ని ఇంతకు ముందు హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన రెవెన్యూ అధికారి కొండల్‌రెడ్డి తీసుకున్నట్లు తెలిసిందని ఆరోపించారు. తన తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారని, తన సోదరి వివాహం చేయడంతో అప్పుల పాలయానని, ఉన్న భూమి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైందని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇప్పటికైనా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తనకు రావాల్సిన భూ పరిహారాన్ని ఇప్పించి ఆదుకోవాలని సంపత్ కోరారు.



భూనిర్వాసితుడు సంపత్ నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న తహసీల్దార్ అనంతరెడ్డి

నిల్వ ఉన్న మద్యం తాగి ఇద్దరికి అస్వస్థత

- హైదరాబాద్‌లో చికిత్స.. పరిస్థితి విషమం
- మద్యంలో కలిసిన పురుగుల మందు

జగదేవ్‌పూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పశువులపాకలో ఉన్న మద్యం తాగి ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురైన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నిరుగంటి నర్సింలు, కొట్టాల కనకయ్య కలిసి ఐదు రోజుల క్రితం నర్సింలు పశువుల పాకలో ఎవరో దాచి (నిల్వ ఉంచిన) మద్యంను తాగారు. తాగిన రెండు మూడు రోజులకు శరీరంపై దద్దుర్లు రావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వారి రక్త నమూనాలు పరీక్షలు నిర్వహించగా మద్యంలో పురుగులమందు కలిపినట్లు తేలింది. దీంతో ఇద్దరి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులే మద్యంలో పురుగుల మందు కలిపారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సైలెన్సర్‌ను మార్చితే కఠిన చర్యలు

- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వాహనాల సైలెన్సర్ మార్పింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాహనాలను తనిఖీ నిర్వహించగా అధిక శబ్దం చేసే 53 వాహనాల సైలెన్సర్లను సీజ్ చేశామని తెలిపారు. వాటిని ట్రాపిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్డు రోలర్‌తో తొక్కించామన్నారు. కొంతమంది యువకులు బైక్‌లకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వాడి భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. సాయంత్రం సమయంలో కోమటిచెరువు, ఇక్బాల్ మినార్, నాసర్‌పుర, రంగనాయక సాగర్, బైపాస్ రోడ్ల వెంబడి రైడ్ చేస్తున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అనంతరం సిద్దిపేట బస్టాండ్ వద్దనున్న ఆటో డ్రైవర్లకు ట్రాపిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు.



రోడ్డు రోలర్‌తో సైలెన్సర్‌లను తొక్కిస్తున్న దృశ్యం

నారు గుంజుతూ పొలంలో పడి రైతు మృతి



తలారి కృష్ణ (ఫైల్)

కౌడిపల్లి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పొలంలో నారు గుంజుతున్న క్రమంలో కిందపడి ఓ రైతు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటపూర్(బి) గ్రామానికి చెందిన తలారి కృష్ణ(45) తన పొలంలో మంగళవారం వరి నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో నంచిలో నారును వేసుకుని పొలం గట్టుపై నుంచి తీసుకువస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కాలు జారి పొలం మడిలో పడిపోయాడు. వెంటనే పైకి లేవడానికి రాకపోవడంతో బురద నీటిని మింగడంతో ఊపిరాడక స్పృహ కోల్పోయాడు. అక్కడున్న వారు కాస్త ఆలస్యంగా గమనించి గట్టుమీదకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. ఈమేరకు కృష్ణ భార్య వినోద ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ.. నల్లవల్లి అటవీ ప్రాంతంలో శవమై

గుమ్మడిదల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన మహిళ గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో శవమై లభ్యమైనట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథన ప్రకారం.. కౌడిపల్లి మండల ప్రాంతానికి చెందిన కేతువత్ మనీ(38) ఈనెల 28న గుమ్మడిదలకు అడ్డా కూలి పనికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె భర్త కేతువత్ రాజు చుట్టుపక్కల ప్రాంతంలో, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గుమ్మడిదల పోలీసుల ద్వారా సీసీ కెమెరాల పుటేజీలను చూసినా జాడ కనిపించలేదు. దీంతో కౌడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మనీ భర్త కేతవత్ రాజు ఫిర్యాదు చేశారు. అయితే 31 నాడు గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఓ మహిళా శవం లభ్యమైందని పోలీసులు ఫోన్ ద్వారా రాజుకు సమాచారం అందించడంతో అక్కడికి బంధువులతో కలిసి వెళ్లి చూడగా తన భార్య మనీ గా గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన భార్యను అడవిలోకి తీసుకెళ్లి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కేతువత్ మనీ(ఫైల్)

అర్చక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- కారుణ్య నియామకాలు చేపట్టాలి
- 6042 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు పే స్కేలు అమలు చేయాలి
- తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 16 దేవాలయాల అర్చక, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఈవో బాలాజీశర్మ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరై అర్చకులతో కలిసి వేద ఆశీర్వచనమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాలు పూర్తిస్థాయిలో చేపట్టాలని, దూప, దీపనైవేద్యం పథకం పేరు తొలగించి గ్రామీణ ప్రాతంలో 6042 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులను క్యాడర్ స్ట్రెంత్ ఏర్పాటుచేస్తూ పే-స్కేలు అమలు జరపాలని కోరారు. అర్చక వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆదుకోవాలని కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి పాటుపడిన ఈవో బాలాజీశర్మ అందించిన సేవలు ఎనలేనివన్నారు. దేవాదాయశాఖలో నాలుగు దశాబ్దాలపాటు ఈవో బాలాజీశర్మ నిబద్ధత తో పనిచేస్తూ ఆలయాల అభివృద్ధికి కృషిచేశారన్నారు. మల్లన్న ఆలయాభివృద్ధిలో తన దైన ముద్ర వేసుకున్న బాలాజీశర్మకు దైవాశీస్సులు వెన్నంటే నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అర్చక సమాఖ్య అధ్యక్షుడు కలకుంట్ల వెంకటనరసింహాచార్యులు, మత్రైక సంఘం అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, తెలగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, మల్లన్న ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, అర్చకులు ఆకుల విజయ్, మహదేవుని రవి, మహదేవుని మనోహర్, మహదేవుని సాంబయ్య, బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవో బాలాజీశర్మను గజమాలతో సత్కరిస్తున్న అర్చకులు

పోషకాహార లోపం కలిగిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పోషకాహార లోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి న్యూట్రిషన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణలోపంతో బాధపడుతున్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందిస్తూ తల్లిదండ్రులకు తగు సూచనలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, కేంద్రాల్లో టాయిలెట్స్ కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో న్యూట్రి గార్డెన్ పెంచాలని, కృషి విజ్ఞాన కేంద్రం వారి సహాయంతో సూపర్‌వైజర్లు, టీచర్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, డీబ్ల్యూవో లలిత కుమారి, డీఐవో డా.శశాంక్, మెప్మా పీడీ గీత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు 52 రోజుల ప్రణాళిక

● డీఈవో వెంకటేశ్వర్లు



ప్రణాళిక విడుదల చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు, అధికారులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ 52 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక తరగతుల కార్యాచరణ ప్రణాళికను డీఈవో వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కోసం 52 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలు ఉదయం 8.15 నుంచి 9.15 వరకు, సాయత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, సెక్టోరియల్ అధికారులు అనురాధ, సూపరింటెండెంట్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణ చర్యలపై దృష్టిపెట్టాలి

● వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి



రైతుల పంటపొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పంటలసాగులో సస్యరక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో నారింజపరివాహక ప్రాంతంలో పంటపొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రదీప్, ఆత్మ ఏటీఎం హమ్మద్‌పాష, రైతులు కిష్టప్ప, క్రిష్ణ, సిద్ధిరాములు, స్వామిదాస్, నర్సింహారెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీకి కట్టుబడి ఉండాలి

● 25వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మెలో బైఠాయించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 25వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఉద్యోగులు పూలదండలు వేసుకుని నిరవధిక దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు మాట్లాడుతూ గతేడాది ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చొరవ చూపాలని కోరారు.

మెరుగైన సేవలతోనే తగిన గుర్తింపు

● జహీరాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారి అఫ్రోజ్

జహీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మెరుగైన సేవలే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపును తెచ్చిపెడుతాయని జహీరాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారి అఫ్రోజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న దుర్గయ్య పదవిరమణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొంతపల్లిలో క్షయ నిర్ధారణ పరీక్షలు

గుమ్మడిదల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి రహిత గ్రామం కార్యక్రమం లో భాగంగా మంగళవారం బొంతపల్లి గ్రామ పంచాయతీలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 13 మందికి లక్షణాలు గుర్తించి చికిత్స ప్రారంభించినట్లు డాక్టర్ మధుకర్ తెలిపారు.



హ్యాపీ న్యూ ఇయర్



తూప్రాన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ముందస్తు ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హపీ న్యూ ఇయర్ అంటు బెలూన్లను ప్రదర్శించారు. నృత్యాలు చేస్తు ఆనందాలు పంచుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్



ఆందోళన చేస్తున్న నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు

జహీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా ఆర్డీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోహీర్ మండలంలోని నాగిరెడ్డి గ్రామంలోని 70 ఎకరాల ప్రభుత్వభూమిని ఇతర ప్రాంతాలకు చెందినవారు ఆక్రమించారన్నారు. వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించి తొమ్మిది నెలలు గడుస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు నర్సింహులు, లక్ష్మణ్, సరిత, సబిత తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎంపీ

నారాయణఖేడ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మనూర్ మండలం బోరంచకు చెందిన పీరయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. రూ.లక్షల సంబంధించి ఎల్‌వోసీని మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బాధితుడి కుటుంబీలకు అందజేశారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తికి రిమాండ్

కోహీర్, డిసెంబరు 31: (ఆంధ్రజ్యోతి) దొంగతనం చేసేందుకు యత్నించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్ తెలిపారు. మొగుడంపల్లి మండలంలోని జంగర్‌బౌలి తండాకు చెందిన జైపాల్ డిసెంబరు 29న రాత్రి కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల ఎస్‌బీఐలో బ్యాంకులో దొంగతనానికి యత్నించి పోలీసులకు చిక్కాడు. బ్యాంకు మేనేజర్ శివ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అల్లాపూర్‌ను మున్సిపాలిటీ నుంచి తొలగించాలని వినతి

తూప్రాన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ మున్సిపాలిటీ పరిధి అల్లాపూర్‌ను మున్సిపాలిటీ నుంచి తొలగించి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి బాలకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజాప్రతనిధులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి'

మునిపల్లి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు, ఎన్నికల ఇన్‌చార్జి జగదీశ్వర్ పాటిల్ పిలుపునిచ్చారు. బీజేపీ మండల ఇన్‌చార్జి చీలపల్లి శ్రీనివాస్ కురుమ అధ్యక్షతన మంగళవారం మండల పరిధిలోని రకంకోల్ గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి హాజరై మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

నల్లపోచమ్మ ఉత్సవాలు

నర్సాపూర్ ;డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్‌లో నల్లపోచమ్మ ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న టీజీయూఈఈయూ నేతలు

తూప్రాన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట టీజీయూఈఈయూ-సీఐటీయూ మంగళవారం ఆందోళన చేపట్టింది. చండీగఢ్, ఉత్తర్‌ప్రదేశ్‌లో విద్యుత్ రంగాన్ని ప్రవేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టినట్లు టీజీయూఈఈయూ-సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీ ఎస్‌పీడీసీఎల్ కంపెనీ రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి, శ్రీనివాస్, హనుమంతు, రాజు, రామకృష్ణ, వెంకటేశ్, భాగ్యరాజు, నవనీత, విజయ, శోభ పాల్గొన్నారు.

తారా అధ్యాపకురాలు అశ్వినికి డాక్టరేట్



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ శాస్త్ర విభాగ అధ్యాపకురాలు(పీడీ) పి.అశ్విని ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో వ్యాయామ శాస్త్రంలో పరిశోధన చేసి నివేదిక సమర్పించినందుకు ఆమెను డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా అశ్వినిని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగదీశ్వర్, అధ్యాపకులు అభినందించారు.

లాంగ్ జంప్‌లో సాయితేజకు బంగారు పతకం



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో జరుగుతున్న సీఎం కప్ అండర్-16 లాంగ్ జంప్ విభాగంలో సంగారెడ్డికి చెందిన కొన్యాల సాయితేజ బంగారు పతకం సాధించారు. సాయితేజను అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ సోహెల్‌అలీ, జిల్లా కార్యదర్శి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్‌అలీ అభినందించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ప్రవీణ్(ఫైల్)

హత్నూర, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం డిసెంబరు 28న అర్ధరాత్రి పిల్లముల ప్రవీణ్ (24) తన మిత్రులతో కలిసి కారులో దౌల్తాబాద్ నుంచి సంగారెడ్డికి బయలుదేరారు. మల్కాపూర్ గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ వీరి కారును బలంగా ఢీకొట్టడంతో ప్రవీణ్‌తోపాటు అతడి మిత్రులకు గాయాలయ్యాయి. దీంతో వారిని సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..



వజ్రయ్య(ఫైల్)

మాసాయిపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసుల కథనం ప్రకారం మాసాయిపేటకు చెందిన మేస్త్రి వజ్రయ్య (55) మాసాయిపేటలోని అచ్చంపేటకు వెళ్లే రైల్వే గేటు వద్ద శుక్రవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



మల్లయ్య(ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) :చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుండ్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పెంజర్ల మల్లయ్య (60) రెండేళ్ల క్రితం పక్షవాతానికి గురికాగా, తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అప్పుడప్పుడు మతిస్థిమితం కూడా కోల్పోతున్నాడు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30న గ్రామంలోకి వెళ్తొస్తానని చెప్పి స్టాండ్ సాయంతో నడుచుకుంటూ వెళ్లిన మల్లయ్య సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం చుట్టుపక్కల వెతుకుతుండగా గ్రామ శివారులోని పబ్బనికుంట వద్ద స్టాండ్ కనిపించింది. చెరువులో గాలించగా మల్లయ్య మృతదేహం లభించంది. మృతుడి కొడుకు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

టిప్పర్ల పట్టివేత

మనోహరాబాద్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం పాలట గ్రామ శివారులోని రైల్వే వంతేన వద్ద సోమవారం రాత్రి మట్టి తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి 9 టిప్పర్లను పట్టుకోని మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



67 వాహనాలు స్వాధీనం

నారాయణఖేడ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని బసవేశ్వర కూడలినుంచి శివాజీ కూడలి వరకు ఇరు పక్కల ఉన్న పలు కాలనీల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 67 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపించిన యజమానులకు తిరిగి వాహనాలను అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు.



మానవ హక్కులపై మట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

గౌతోజీగూడలో పౌరహక్కుల దినోత్సవం

మనోహరాబాద్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల పరిధిలోని గౌతోజీగూడ గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పంచాయితీ వద్ద గ్రామస్థుల సమక్షంలో మానవ హక్కుల గురించి అవగామన కల్పించారు. గతంలో గ్రామంలో కుల బహిష్కరణ కేసులు నమోదైన నేపథ్యంలో పలు సూచనలు చేశారు. తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, డీటీ కౌశిక మాట్లాడుతూ పౌర హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రేణుకుమార్, ఆర్ఐ దీక్షిత్, ఎంపీఏ ఆదినారయణ, ఏఈ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

26మందిపై కేసు నమోదు

టేక్మాల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెరువు ముందటి తండా గ్రామ పంచాయతీకి చెందిన భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య భూవివాదం జరిగింది. ఈ విషయంలో 26 మందిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఇరు వర్గాలు పరస్పరం దాడి చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. ఇరువార్గాలకు చెందిన రాజేందర్, విఠల్ ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

రాంరెడ్డి కుంటను పరిశీలించిన అధికారులు

వెల్దుర్తి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎదులపల్లి రాంరెడ్డికుంట అక్రమణ విషయమై మంగళవారం ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ పరిశీలించారు. నాలుగురోజుల్లో రెవెన్యూ రికార్డుల ప్రకారం కుంటను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.















